క్లుప్తంగా

10న మండల సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. గత నెల 28న నిర్వహించాలనుకున్న సమావేశం ప్రజాపాలన కార్యక్రమంతో వాయిదా పడిందన్నారు. తిరిగి ఏర్పాటు చేసిన సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకు నివేదికలు అందించని శాఖలు వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని కోరారు.

నేడు పంచాయతీ భవనం ప్రారంభం

నర్వ: మండలంలోని కుమార్‌లింగంపల్లిలో నూతన పంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. వీటితో పాటు ఉదయం 8 గంటలకు కొత్తపల్లి, 9 :30 బెక్కర్‌పల్లి, 11గంటలకు రాంపూర్, మధ్యాహ్నం 12 : 30 కుమార్‌లింగంపల్లి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఎంపీ సీటు కేటాయించాలి

ధన్వాడ: నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్ ఎంపీ సీటు కేటాయించాలని సర్పంచ్ అమరేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషిచేశారని అన్నారు. రాజేందర్‌రెడ్డికి ఎంపీ సీటు కేటాయిస్తే మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభివృద్ధి చేస్తారని అన్నారు.

చెత్తబండి కోసం నిరసన



మరికల్: మండలంలోని ఎలిగండ్లలో చెత్తబండి ఇళ్లవద్దకు రావడం లేదని కొందరు గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై చెత్తబుట్టలతో నిరసన వ్యక్తం చేశారు. 15రోజుల నుంచి చెత్తబండి రాకపోవడంతో ఇళ్లలోనే చెత్తను నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నిలిచిన చెత్తబండిని గ్రామంలో ఇంటింటి పంపించి చెత్తను సేకరించాలని వారు కార్యదర్శి, సర్పంచ్‌ను డిమాండ్ చేశారు. లేనిచో ప్రమాదాకారమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

మొక్కు చెల్లించుకున్న ఉపసర్పంచ్



మరికల్: కాంగ్రెస్ నుంచి పర్ణికారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో శుక్రవారం తీలేర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఉపసర్పంచ్ భజరప్ప 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. మొదటిసారిగా నారాయణపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలని ఎల్లమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునిత, బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు, ఆలయ చైర్మన్ కొండప్ప, లక్ష్మన్న, ఆంజనేయులు, కుర్మన్న పాల్గొన్నారు.

కమిటీ సభ్యుల ఎన్నిక హర్షం

ఊట్కూరు: భారతీయ రైల్వే క్షేత్రస్థాయిలో ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు, సేవలు కల్పించేందుకు చెక్‌లేయర్ రైల్వేస్టేషన్ నూతన సభ్యుడిగా మహావీర్, భాస్కర్, నర్సింహ, కే శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు శుక్రవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు జలంధర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్వీఎస్ సందర్శన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ కళాశాలను పీయూ ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈమేరకు కళాశాలలో రోగులకు అందిస్తున్న సేవలు, డాక్టర్‌ల విధుల వంటి అంశాలపై కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాలెన్న, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన



కాచ్‌వార్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మద్దూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి, కాచ్‌వార్, కొండదొడ్డి, మాదన్‌పల్లి, ముస్లాయిపల్లి, ముస్టిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. మండలంలోని మొత్తం 1627 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని తపస్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతుల మీద ఆవిష్కరించారు. అలాగే జీఓ నంబర్ 317ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బాధిత ఉపాధ్యాయులు శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహకి వినతి పత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి జాన్‌సుధాకర్ తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఓ రహిమతుల్లా, వైస్‌ఎంపీపీ రామేశ్వరమ్మ, సురేష్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, లక్ష్మి, విజయలక్ష్మి, వెంకటేష్, ఎంపీటీసీలు బాల్‌రాంరెడ్డి, పారిజాత, అశిరెడ్డి, డీలర్ లక్ష్మారెడ్డి, నర్సింహులు, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని మున్సిపాల్ కమిషనర్ బాల్‌రాంనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16వార్డుల్లో 579 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావనీ, వైస్‌చైర్మన్ అఖిలరెడ్డి, కౌన్సిలర్లు స్వేతారెడ్డి, కౌసల్య, అర్చన, మొగులప్ప, కొండయ్య, చీరాల సత్యనారాయణ, ప్రసన్నరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: గత ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలు ప్రజాపాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనతో అందిస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం యాంకి గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని ఆయన అధికారులకు సూచించారు.అలాగే ప్రజాపాలన ద్వారా తీసుకున్న దరఖాస్తులను డాటా ఎంట్రీ నమోదు చేపట్టిన ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో గత కొన్ని రోజులుగా చేపట్టిన ప్రజాపాలనలో గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేపట్టే కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, సర్పంచ్ రమేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో మొత్తం పది గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అచ్చంపల్లి 207, ఆల్లీపూర్‌లో 169, ఎక్కమేడ్‌లో237, గోర్లోనిబాయి 210, కొత్తపల్లి తాండా 240, లక్కయిపల్లి 237, నాగంపల్లి 241, పర్సపూర్ 209,పెద్దపూర్ 202, పోర్లకుంటతాండా 176 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటితోపాటు మరో 29పంచాయతీలో దరఖాస్తులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 2,328 దరఖాస్తులు, 993 ఇతర దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.



వినతిపత్రంఅందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇంటింటికీ అక్షతలు చేరవేయాలి



అలయంలో చర్చిస్తున్న గ్రామపెద్దలు



ఊట్కూరులో

మద్దూరు: ఈ నెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా రాముడి అక్షతలను ఇంటింటికీ చేరవేయాలని వీహెచ్‌పీ, విశ్వహిందు పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తీర్మానించారు. శుక్రవారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం పూజ కార్యక్రమాలు, భజనలు, నాటకాలు తదితర కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, గ్రామస్తులు రాంరెడ్డి, నర్సింహులు, రాజేందర్‌రెడ్డి, రాజు, సతీష్, మల్లికార్జున్, సాయిలు, భరత్, కాశప్ప, కాలప్ప, నర్సింహ, వెంకట్‌రాములు, మోనేషాచారి పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని గాంధీనగర్ వీధిలో శుక్రవారం రాముడి అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నర్సింగప్ప, వెంకట్‌నారాయణ, భీంరాజు, రాములు, రాఘవేంద్ర, నరేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అక్షింతలను స్థానిక అయ్యప్ప క్షేత్రంలో, శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రామమందిర ట్రస్ట్ పంపిన అక్షింతలు ఆత్మకూర్‌లో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, తమ్మలి విజయ్, మాస్టర్ బాలు, మ్యాడం శ్రీను, నర్సింహారెడ్డి, కొండాపురం రాము, తోట రవి, లింగన్న, బాలకృష్ణ, దివాకర్, జిందె శ్రీను, బాలు, గాడిశేషు, రఘుయాదవ్ తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్‌లోని అయ్యప్పక్షేత్రంలో..

బాలుర కళాశాల విద్యార్థులకు వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో రెస్యూమే ప్రిపరేషన్, కెరీర్ గైడెన్స్‌పై సెట్విన్, లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం అని, భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 46 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ భగవంతాచారీ, కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, సాధిక్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలతో వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

వేడుకలకు సర్వం సిద్ధం



జిల్లా కేంద్రంలోని అబ్దుల్ ఖాదర్‌షా దర్గా



దర్గాలోని మజార్ షరీఫ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహిమతుల్లా అలై దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉర్సుకు ఘనమైన చరిత్ర ఉంది. సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా మజ్‌జూబ్ ఓ సాధారణ పోలీస్ కానిస్టేబుల్. 1929లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ముస్లిం పెద్దలు చెబుతున్నారు. వారి వివరాల ప్రకారం.. ఆయన తన విధులను నిర్వరిస్తూనే దైవ చింతన, ఆధ్యాత్మిక భావనతో ప్రజల్ని చేరదీసేవారని. తన పదవీ విరమణ అనంతరం జిల్లా కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో ఓ చెట్టుకింద కూర్చొని ప్రజలకు హితబోధ చేసేవారు. ప్రతి గురు, శుక్రవారాలు ఖాదర్‌షా వద్దకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి తమ బాధలు, సమస్యల్ని విన్నవించుకునేవారు. కాగా ఆయన పరిష్కార మార్గాలను చెప్పేవారని తెలిసింది. ఖాదర్‌షా మరణానంతరం అతడి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు 1939లో రాయిచూర్ రోడ్డు పక్కన నిర్మించిన ఆయన సమాధిపై ఓ దర్గాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దర్గాను కులమతాలకతీతంగా ప్రజలు దర్శించుకుంటున్నారు.

నేటి నుంచి ఉర్సు

అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వేడుకులకు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. 6న సాయంత్రం 8 గంటలకు జలాభిషేకం (గుసుల్ షరీఫ్), 7న ఉర్సు వేడుకల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవం నిర్వహించనున్నారు. 8న దీపారాధన, 9న జ్యారత్ ఫాతేహాతో ఉత్సవాలు ముగుస్తాయి.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మక్తల్: గర్భిణి, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లిశ్వరీ అన్నారు. శుక్రవారం మండలంలోని మాద్వార్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చేగుడ్లు, పాలు, బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీకి వచ్చే పిల్లల సంఖ్యను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, ఆయాలు శేషమ్మ, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీని శుభ్రపరచాలి



మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలోని పలు కాలనీలోని డ్రెయినేజీలలో చెత్త, చెదారం చేరి మురుగు పారడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురుగునీటితో దోమల బెడద అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు సమస్య విన్నవించిన పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అమరచింత టు శబరిమల..

అమరచింత: పట్టణానికి చెందిన అయ్యప్ప మాలధారుడు లడ్డు సత్యనారాయణ శుక్రవారం అమరచింత నుంచి శబరిమలకు బైక్‌పై బయలుదేరినట్లు గురుస్వామి మాకం నర్సింహులు తెలిపారు. కొన్నేళ్లుగా లడ్డు సత్యనారాయణ అయ్యప్పదీక్ష చేపట్టి స్వామి దర్శనం కోసం శబరిమలకు మోటార్ బైక్‌పై వెళ్తున్నాడని తెలిపారు. ఈసారి అయ్యప్ప దర్శనం కోసం తనతో పాటు మరో నలుగురు సివిల్ స్వాములు సైతం బైక్‌పై శబరిమల యాత్రకు బయలు దేరారని పేర్కొన్నారు.



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం నర్సింహులు

మాగనూర్: ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ అంశాలు, డాటా క్రమంగా నెలవారీగా నమోదు చేయాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ తీరుపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్ రీడింగ్ ప్రాసెస్ మీద డెమో నిర్వహించారు. గ్రంథాలయ పీరియడ్ నిర్వహణ తప్పనిరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరి బాల్‌రాం, డీఆర్పీ జానకిరాం, సీఆర్పీ కృష్ణ, ఎల్లాగౌడ్, హెచ్‌ఎం తిరుపతి, లక్ష్మారెడ్డి, తిమ్మన్న, శివరాజ్, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదులో జాగ్రత్తలు పాటించాలి



వీసీ ద్వారా శిక్షణ ఇస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్: పీఎస్‌లలో వచ్చే ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వర్టికల్ ఇన్‌చార్జి పీసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పీఎస్‌లలో టెక్ టీమ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి వర్టికల్ అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, కేసుల విషయంలో టెక్నికల్ విషయాలను క్షుణంగా పరిశీలించాలన్నారు. సాంకేతికతను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకోవాలన్నారు. నేరం జరిగిన స్థలంలో లాంగి ట్యూడ్, లాటిట్యూడ్ విధిగా సీడీఎఫ్ ఫామ్‌లో నమోదుచేయాలన్నారు. ప్రతి అంశాన్ని తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్క సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌పై అవగాహన కల్గిందాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని, పీఎస్‌లో జరిగే ప్రతి విషయాన్ని ఎస్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకునిరావాలన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నారాయణపేట రూరల్ : జిల్లా పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆ సంఘం నాయకులు సీపీఎస్ రద్దు, 317 జీఓ బాధితులకు న్యాయం, స్కావింజర్ల నియామకం, పండిత్ పీఈటీల అప్‌గ్రేడేషన్, బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని, పెండింగ్ బిల్లులు అందించాలని విన్నవించారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన జీఓ 2ను గుర్తు చేయడంతో పాటు సంక్రాంతి కానుకగా మూడు డీఏలు అందించే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద్గీర్‌జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతుల ప్రధానోత్సవంలో నిర్వాహకులు

కోస్గి: వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా హిందూ వాహిని మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆటపోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో పలు పాఠశాలలు, కళాశాలల బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభ చాటారు. పోటీల్లో విజేతలైన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీలో బాలుర విభాగంలో ఐటీఐ విద్యార్థులు గెలుపొందారు. బాలికల విభాగంలో గుండుమాల్ విద్యార్థులు మొదటి స్థానం, సర్జఖాన్‌పేట విద్యార్థులు రెండోస్థానం పొందారు. ఇదే క్రమంలో రన్నింగ్ పోటీల్లో రాజేష్, రాహుల్ గెలుపొందగా, బాలికల విభాగంలో దస్తమ్మ, సింధూ విజేతలుగా నిలిచారు. విజేతలైన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. సంఘం మండల బాధ్యులు భరత్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణ మోక్షానికి మార్గం



చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న భక్తులు

ఆత్మకూర్: జ్యోతిస్వరూపుడైన అయ్యప్ప నామస్మరణ మోక్షదాయకమని గురుస్వాములు శ్రీనివాస్, అనిల్, కూరగాయల రఘు అన్నారు. శుక్రవారం స్థానిక అయ్యప్ప క్షేత్రంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం, దీక్షా పరులకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, విండో అధ్యక్షులు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, గాడి లక్ష్మీనారాయణ, గురుస్వాములు జిన్నారం శ్రీను, బాలు, తోట రవి, గాడి లక్ష్మణ్, పురుషోత్తం, దివాకర్, చందుగౌడ్, నరేష్, హర్షగౌడ్, బాలరాజు, దీక్షాపరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో తీలేర్ భజన మండలి



తిరుపతిలో తీలేర్ భజన మండలి సభ్యులు

మరికల్: మండలంలోని తీలేర్ రేణుక ఎల్లమ్మ భజన మండలి సభ్యులు శుక్రవారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి సన్నిధానంలో సేవలు నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు తిరుపతిలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు నిత్య అన్నదాన, దర్శన సేవ కార్యక్రమాలను అందిస్తున్నట్లు టీటీడీ మండల ధర్మకర్త శ్రీరామ్ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ భూమిపై అక్రమార్కుల కన్ను



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో సర్వేనంబర్ 247, 250లో 5.30 ఎకరాల భూమిని 30ఏళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం కేటాయించిందని.. దానిపై తాజాగా అక్రమార్కుల కన్నుపడిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. ఇట్టి భూమిని కాజేసేందుకు యత్నిస్తున్నారని, పలు సందర్భాల్లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమంగా ఇళ్లను నిర్మించుకున్నా చర్యలు తీసుకోలేదని అన్నారు. అధికారుల సహకారం లేనిదే అక్రమార్కులు ఇలాంటి చర్యలకు పాల్పడుతా అని ప్రశ్నించారు. విషయమై శుక్రవారం అర్బన్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని ఓ ఉద్యోగికి ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదరయ్య, నాయకులు కేశవులు, నాగన్న, రాములు, చెన్నయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.